ఆంధ్ర వాహిని (అట్టావా) నిర్వహించిన 1988 శ్రీరామనవమి కథల పోటీలో సాధారణ ప్రచురణకి ఎన్నికైన కథ

# కడలి కెరటాలు

**- మేరేపు లక్ష్మి**

'విశ్వం! అనంతమైన ఈ కడలినీ కడలి కెరటాలనీ చూస్తూ వుంటే నీకేమనిస్తోంది?'

నేను చెప్పాలనుకుని వచ్చిన విషయాన్ని ఎలా మొదలు పెట్టాలో అరగంట నుండి తికమకపడుతున్న నన్ను ముకుందం హఠాత్తుగా వేసిన ప్రశ్న ఆశ్చర్య చకితుణ్ణి చేసింది.

ఏమనిపిస్తుంది? ఉవ్వెత్తున ఎగిసే ఆ కెరటాలు నింగిని తాకాలని ఆరాటపడుతున్నట్టు అందుకోలేక మళ్ళీ కడలినే చేరినా, నిరాశ చెందక తమ పూర్వ ప్రయత్నాన్నే కొనసాగిస్తున్నట్టు... కవినైతే యింకేమైనా స్ఫురించేదేమోగాని అభిప్రాయాలను అక్షరాలలోనే సరిగ్గా వెల్లడించలేని నాకు కవిత్వమబ్బడమా?... అదే చెప్పాను ముకుందానికి.

ముకుందం వేదాంతిలా నవ్వాడు ... కడలి అంచుల దాక దృష్టి సారిస్తూ ... 'నాకేమనిపిస్తుందో చెప్పనా?' అని అడిగి మళ్ళీ తనే అందుకున్నాడు... 'ఎడదలో బడబాగ్నిని, ఎదలో అటు-పోటులను ఎన్నింటిని సహిస్తున్నా, తన సంతోషాన్నైనా, దుఃఖాన్నైనా తన పరిధిలోనే అనుభవిస్తున్న ఆ సముద్రుని మర్యాదాపాలన లోకానికి చక్కని సందేశం అందిస్తున్నట్టుగా...


ఎంతటి భావ గాంభీర్యం? సముద్రాన్ని కాచి వడగట్టినట్టుగా చెప్పాడు... అవును మరి! సముద్రంతో ముకుందానికున్న అనుబంధం ఈనాటిదా? ఏభై ఏళ్ళ నాటిది...

* * *

ముకుందం, నేను యించుమించుగా ఒకే వయసు వాళ్ళం... చిన్నప్పటి నుండి కలిసి ఆడుకున్నాం, కలిసి చదువుకున్నాం.

చిన్నప్పటి నుండి ముకుందం మనస్తత్వం విచిత్రంగా వుండేది. ఒకసారి ఏడేళ్ళ వయసులో వాళ్ళ నాన్నగారు ముకుందాన్ని కొట్టారు. సాయంకాలమయేసరికి ముకుందం జాడ ఎక్కడా లేదు. అంతా కంగారుగా మా యింటికి వచ్చారు... నా దగ్గరికి వచ్చాడేమోనని, నాకేదో అనుమానం వచ్చి బీచ్ వైపు పరిగెత్తాను. నా అనుమానం నిజమైంది! అక్కడ యిసుకలో ఒంటరిగా కూర్చుని సముద్రపుటలలని తదేకంగా చూస్తున్నాడు... చేతిలో యిసుక కెలుకుతూ...

అలాగే... మరోసారి ... పదవ తరగతి పరీక్షా ఫలితాలు వచ్చినప్పుడు ముకుందం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు... నేను రెండు మార్కుల తేడాలో ద్వితీయ శ్రేణిలో స్థానం సంపాదించుకున్నాను. ఆ సాయంకాలం ఫ్రెండ్స్ మంతా కలిసి సినిమాలకీ, షికార్లకీ బయల్దేరాం. ముకుందం మాత్రం తన సంతోషాన్ని కూడా ఆ సముద్రపుటలతోనే పంచుకున్నాడు!



వయసుతోపాటు మా స్నేహమూ పెరిగింది. ముకుందమంటే నాకు పంచ ప్రాణాలు! వాడికి నేను ఆరో ప్రాణం! ఎవరి సంసారాలు వారికి ఏర్పడి, ఉద్యోగ రీత్యా నేను బెజవాడ వెళ్ళవలసి వచ్చినా, నెలకో, రెండు నెలలకో ఒకసారి కలుసుకుని కష్ట సుఖాలు చెప్పుకోవడం చిన్ననాటి ఆ అనుభూతులని వల్లె వేసుకోవడం మాకు పరిపాటైపోయింది.

అవే మా జీవితాలలో మరపురాని మధుర క్షణాలు.

* * *

ముకుందం నలుగురు పిల్లల తండ్రి అయ్యాడు. అర్ధాంగి జానకి హఠాత్తుగా కన్ను మూయడంతో ముకుందం జీవితంలో ఒంటరివాడై పోయాడు. ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. పెద్ద కొడుకు శేఖర్, పెద్ద కూతురు పద్మజల పెళ్ళిళ్ళు ఒకే సంవత్సరం జరిపించి కొంత బాధ్యత తీరిందని ఊపిరి పీల్చుకున్నాడు.

శేఖర్ వృత్తిరీత్యా విదేశాలలో స్థిరపడవలసి వచ్చినందుకు మొదట్లో ముకుందం కొంత బాధ పడినా, క్రమేపి ఎవరి జీవితాలు, ఎవరి ఆశయాలు వాళ్ళవి. కన్నంతవరకే తను తండ్రి. అంతకు మించి శాసించే హక్కు తనకి లేదు అనే ధోరణిలో పడిపోయాడు.




నా సాంసారిక ఝంఝూటంలో పడి నేను ఆరు నెలల వరకు ముకుందాన్ని కలియలేక పోయాను. ఆర్నెల్ల తర్వాత నేను వెళ్ళినప్పుడు ముకుందం బ్రద్దలయ్యే అగ్ని పర్వతంలా వున్నాడు.

"విశ్వం! మాశావురా విధి వైపరీత్యం? నా పద్మ జీవితంతో ఎలా ఆటలాడుకుందో? అల్లుడు స్కూటర్ ఏక్సిడెంట్‌లో... ఆపై చెప్పలేకపోయాడు...జరిగినది అర్థం చేసుకున్న నేను అవాక్కయి పోయాను... మేరు పర్వతం లాంటి ముకుందమే బేలగా రోదిస్తుంటే ఏమని ఓదార్చను? 'అది వట్టి మనిషి కూడా కాదురా' అన్నాడు. ఆ కన్న తండ్రి కడుపు కోత ఏమని చెప్పగలను?

ప్రసవ సమయంలో తల్లి-బిడ్డ యిద్దరూ కన్ను మూయడంతో ముకుందం జీవితంలో ఒక విషాద పర్వం ముగిసింది. అప్పటికి నేను కూడా తిరిగి విశాఖ రావడంతో ముకుందం మనసు కొంత కుదుట పడింది.

ప్రణయ జీవితంలో భంగపడి రెండవ కూతురు వాణి, నిరుద్యోగ పర్వంలో ఓడిపోయి వయసు మీరి పోయిన రెండో కొడుకు రవి యిద్దరూ స్వల్ప వ్యవధిలోనే తమ జీవితాలను చేజేతులా అంతం చేసుకున్నారు.

ఈ దెబ్బలకు తట్టుకోలేక ముకుందం నెల రోజులు మంచం పట్టాడు... 'వీళ్ళకి నేనేం లోటు చేశాననిరా నా మీద యింత కసి? అందరూ నన్ను వదిలి వెళ్ళి పోతున్నారు...' అన్నాడు నాతో కంట తడి పెట్టుకుంటూ.

మళ్ళీ అదే సముద్ర తీరంలో సాయం వేళల కూర్చుని గతాన్ని స్మరిస్తూంటే, కాలం చేసిన గాయాలని కొంత వరకు మాన్పుకోగలిగాడు ముకుందం.

తండ్రి మనశ్శాంతి కోసం తన కవలలు అనిల్, సునీల్‌లను శెలవులకి తీసుకు వచ్చి తండ్రి దగ్గర విడిచి


# ADMISSION NOTICE

ప్రపంచంలో ఏకైక Magic Schoolగా గుర్తించబడిన పై సంస్థ నందు Magic నేర్చుకొనే ఔత్సాహికుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి. సుప్రసిద్ధ, ప్రఖ్యాత మెజీషియన్, జాదురత్న **Sri B.V.Pattabhiram** గారి పర్యవేక్షణలో స్వయంగా శిక్షణ ఇవ్వబడును. ఈ శిక్షణ ఒక సంవత్సరంబాటు ప్రతినెలా మొదటి ఆది వారం జరుగుతుంది.

కనీస విద్యార్హత: **Intermediate,**

**Age:** 15 నుండి 25 సం.లోపు.

తరగతులు 15-8- 88 నుండి ప్రారంభం.

వెంటనే సంప్రతించండి.

**Sri P.Suri Babu**, Correspondent.

**Balanandam Magic and Hypnotism School**

Narayanaguda **Hyderabad - 500 029**

**Telephone: 61443**



# పెండ్లికి ముందు, పెండ్లి తరువాత



అన్నిరకములైన వ్యాధులను ఇంకా నపుంసకత్వాన్ని, హస్త ప్రయోగమువలన నరాల బలహీనతకు, స్వప్న మందు వీర్యస్ఖలనము వలన బలహీనతకు (V D) గనేరియా, సిఫిలిస్, ఇంకా సంతానములేనివారు సంతానమును కలిగించుకొండి. ఈ వ్యాధులకు సుమారు ఎన్నో సంవత్సరములు అనుభవముగల డాక్టరు ఎం.హెచ్.మల్లిక్ (Govt. Regd) గారితో చికిత్స పొందవలెను. వీరి చికిత్స నుంచి వేలాది ప్రజలు రోగముల నుంచి సుఖపడినారు.

సూచనము: మీరు ఏ రోగము వున్నా పర స్థలమునుంచైనా పోస్టుద్వారా పత్రము వ్యవహరించుకొని మందులు పోస్టు పార్సిల్ ద్వారా తెప్పించుకొని ఉపయోగించుకొనవచ్చును. మీరు మీ దాంపత్య సుఖమును పొందండి.

*సంప్రతించు వేళలు: ఉదయం 9 గం.నుంచి సాయంత్రం 8 గం. వరకు. ఆదివారం కూడా పనిచేయును.*

## మల్లిక్ డిస్పెన్సరి

34/2, శ్రీ హరిరాం కాంప్లెక్స్, సాగర థియేటర్ ప్రక్కన

కెంపేగౌడ రోడ్డు బెంగుళూరు- 560 009

పెట్టాడు పెద్ద కొడుకు శేఖర్. ప్లెయిన్ క్రాష్‌లో మరణించిన శేఖర్ దంపతులకు పిల్లలతోడి ఆ ఎడబాటు శాశ్వతమైపోతుందని ఎవరికి తెలుసు?

ఆ సంఘటనతో యించు మించుగా ముకుందం తన జీవిత నిఘంటువులో నుండి ' నా వాళ్ళు ' అనే పదాన్ని తీసేశాడనే చెప్పాలి... ఇంక మిగిలిందల్లా సూర్య చంద్రుల్లా ఆ యిద్దరే! ఆ యిద్దరు మనవలే ముకుందానికి రెండు కళ్ళు! కన్నబిడ్డల మీద నున్న మమకారమంతా ప్రోది చేసి ఆ యిద్దరి మీదా కురిపించాడు. వాళ్ళు లేని తన జీవితం వ్యర్థమన్నంతగా వారితో పెనవేసుకుపోయాడు.

అలాంటి ఆ యిద్దరూ కూడా యిక నీకు లేరని ఎలా చెప్పగలను? అది విని ముకుందం తట్టుకోగలడా?

ఆలోచిస్తూనే సముద్రతీరం చేరాను. అక్కడ అల వాలైన స్థలంలో ముకుందం సముద్రపుటలలను తదేకంగా చూస్తూ కూర్చున్నాడు... ఈ క్షణమో, ఆ క్షణమో బ్రద్దలయ్యే అగ్ని పర్వతంలా వున్న ముకుందాన్ని చూస్తూనే నా కళ్ళు అప్రయత్నంగా చెమర్చాయి.

* * *

'ఏదో చెప్పాలని వచ్చి ఏమిటిలా ఆలోచిస్తూ వుండిపోయావ్?' భుజం మీద ముకుందం చేయి పడడంతో యీ లోకంలోకి వచ్చాను.

చెప్పాలనుకున్న మాట నా పెదవి దాటి బయటికి రావడం లేదు. ముకుందమే మళ్ళీ 'ఇంక నాకు మిగిలినది నువ్వు ఒక్కడివేరా' అన్నాడు గాద్గదికంగా. వాడి చేతుల్లో ముఖం దాచుకుని మౌనంగా రోదించాను.

'హైద్రాబాద్ తీసుకు వెళ్ళమన్నావు... నువ్వు నా కప్పచెప్పిన నీ కంటి పాపలను తిరిగి నీకు అప్పజెప్ప లేకపోయాను... ఆ రైలు ప్రమాదంలో నేను పోయి వాళ్ళు బ్రతికినా బాగుండేదిరా... ముకుందం నువ్వు నాకో మాట యివ్వాలి... నువ్వు ఏ అఘాయిత్యానికి వడిగట్టవని నా చేతిలో చెయ్యి వేసి చెప్పు...' చాచిన నా చేతిని, నా ముఖాన్ని మార్చి మార్చి చూశాడు ముకుందం.

'ఇప్పుడు నీకా అనుమానం ఎందుకు వచ్చిందిరా? నా నలుగురు పిల్లలు నాకు దూరమైన నాడే మొండిగా బ్రతికేశాను. మన బ్రతుకును శాసించుకునే హక్కు మనకి లేదు విశ్వం. మన సంకల్పంతో జన్మించామా? మన సంకల్పంతో జీవితాన్ని అంతం చేసుకోవడానికి? మనం మానవ మాత్రులం... మనల్ని సృష్టించిన ఆ భగవంతుడికే ఆ హక్కు వుంది. ఇది తెలీని వెర్రి వాళ్ళు 'ఆత్మహత్య' అంటూ ఆత్మీయులకి దూరమౌతూ వుంటారు. మన కోసం మనం ఎప్పుడు బ్రతుకుతాము. ఇతరుల కోసం బ్రతకడంలోనే వుందిరా పరమార్థం... ముకుందం మాటలతో నాలో చిన్న అనుమానం మొలకెత్తింది...

అది పసిగట్టిన వాడిలా చిన్నగా నవ్వాడు ముకుందం 'నా లాంటి వాళ్ళు ఎవరి కోసం బ్రతకడం? అని కదూ నీ సందేహం? కోరుకున్నా రాని చావు కోసం ఎదురు చూస్తూ, గడియలు లెక్క పెట్టుకుంటూ, నా చేతుల మీదుగా తనువు చాలించాలనే చివరి కోరికతో జీవచ్ఛవంలా బ్రతుకుతున్న నా తండ్రి చివరి కోరిక తీర్చడం కోసం! నేననుభవిస్తున్న ఈ కడుపు కోత తొంభై దాటిన నా కన్నతండ్రికి కలగకూడదనే ఆరాటంతో యిలా బ్రతికి వుంటానురా విశ్వం...!' ముకుందం చివరి మాటలకి నా బాధంతా గొంతులో వుండచుట్టుకుని అడ్డం పడినట్టు అయింది...

'ఎడదలో బడబాగ్ని, ఎదలో ఆటుపోటులను...' అన్న ముకుందం మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి.

దూరంగా సముద్రపు కెరటాలు వువ్వెత్తున ఎగిసి పడుతున్నాయి... ఆ సముద్రానికి, ఈ ముకుందానికీ తేడా ఏమిటి? అనుకుంటూ నేనూ ముకుందం వెనకే నడిచాను.

*

## భజగోవింద శ్లోకాలు

దినయామిన్యౌ సాయం ప్రాతః
శిశిర వసన్తౌ పునరాయాతః
కాలః క్రీడతి గచ్ఛత్యాయుః
తదపి న ముంచత్యాశావాయుః

— ఆదిశంకరులు

పగలు, రాత్రి, ఉదయం, సాయంత్రం, శిశిరం, వసంతం వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. కాలం ఆడే ఆటలో ప్రాణాలూ పోతాయి, కానీ మానవుడు ఆశ మాత్రం వదిలిపెట్టడు.

పగలు, రాత్రి ఒకదాని వెనుక ఒకటి వస్తూనే వుంటాయి. ఒక్కొక్క రోజు గడుస్తోంది అంటే చావు క్రమక్రమంగా దగ్గిర పడుతోంది అని అర్థం. ఆయువు అయిపోతోంది. నీ శ్వాస ఆగిపోతుంది. కాని ఆశ అనే శ్వాస మాత్రం ఆగదు. తీరని కోరికలతో, ఆరని జ్వాలలతో, అణగారని ఆశలతో సమయాన్ని వృథా చెయ్యకు. ఈ పై పై మెరుగులని చూసి ఇవి శాశ్వతం అని భ్రమపడకు. కోరిక అనేది ఎంత భయంకరమైనదో, ఎంత నీచమైనదో చెప్పడానికే రాముడిని సీత 'బంగారు లేడిని' తెమ్మంది. 'బంగారు లేడి' అనేది ఒకటి ఉండదు అనే జ్ఞానం ఆ క్షణంలో నశించింది. ఆ అజ్ఞానమే తరువాతి కష్టాలకు దారి తీసింది.

ఒకప్రక్క ఆయువు తరిగిపోతూ వుంటే మరో ప్రక్క కోరికలు పెరిగిపోతూ వుంటాయి.

ఇప్పుడే ఈ క్షణాన్నే తెలివితెచ్చుకో. నిత్యసత్య స్వరూపుడైన భగవంతుడిని తెలుసుకో.

వ్యాఖ్య: డాక్టర్ పప్పు వేణుగోపాలరావు.

## భక్తచింతామణి

జగ మన్యోన్య విరుద్ధ వస్తువులతో సంపూర్ణమై యుండియున్.
దగవుం ధర్మము గల్గి వర్థిలుట కాధారంబు నీవే గదా!
పగ సాధింతు మటంచు దుర్మదమునన్ బాపాత్మకుల్ రే గినన్
సిగపూ వాడగ నీవు సాధులకు తండ్రీ! భక్త చింతామణీ!

స్వర్గీయ వసురాయ కవిగారి భక్తచింతామణి శతకం